బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలో నాన్ షెడ్యూల్ గుమ్మకోట పంచాయతీ మెట్టపాలెం గ్రామంలో బాల్యవివాహనాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ పిఓ సంతోషి కుమారి మాట్లాడుతూ,చిన్న తనంలోనే పెళ్లిలు చేయకుడదన్నారు. అంగన్వాడీల ద్వారా చిన్నారులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాగి అప్పారావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అంగన్వాడీలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్యామల, వైద్య సిబ్బంది నందయ, దాలన్నదొర, ఉప సర్పంచ్ కన్నయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న సిడిపిఒ

వైద్యులు ప్రజల విశ్వాసాన్ని పొందాలి

-కలెక్టర్ దినేష్ కుమార్ హితవు

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రజల విశ్వాసాన్ని పొందాలని, జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హితవు పలికారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లాలోని 18 ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికేట్లను కలెక్టర్ సంబంధిత డాక్టర్లకు అందజేశారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు, ప్రభుత్వ ఆసుపత్రుల విశ్వసనీయతను పెంచడం, మంచి పనితీరు సౌకర్యాలను గుర్తించడం కోసం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ ధృవపత్రాలను జారీ చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాణాలు, ప్రజారోగ్య సదుపాయాలకు, గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీస్‌లకు అనుగుణంగా రోగులకు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు నాణ్యమైన సేవలు అందించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

జిల్లా పరిధిలో మూడు (అరుకు, చింతపల్లి, కూనవరం), ప్రాంతీయ ఆసుపత్రులకు ఏడు (ఇందుకూరుపేట, తాజంగి, సప్పర్ల, పీడతమామిడి, జి.మాడుగుల, ఎల్లవరం, లాగరాయి), ప్రాథమిక ఆసుపత్రులకు ఆరు (మూసిరిమల్లి, గుట్టులపుట్టు, అడుగులపుట్టు, కొత్త పాడేరు, నెల్లూపూడి, చింతూరు, రెండు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ అత్యుత్తమ సేవలను గుర్తించి సంబంధిత వైద్యాధికారులకు, కమ్యూనిటీ హెల్త్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, డిఆర్ఓ, బి.పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా పాల్గొన్నారు.

జిల్లాలో ఏడాది పాటు మారిటోరియం

పాడేరు : ఇటీవల వరుసగా వచ్చిన వరదలు, వానలకు జిల్లా ప్రజలకు, రైతాంగానికి కలిగిన నష్టాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఏడాది పాటు మారిటోరియం ప్రకటిస్తూ డిసిసి చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం రైతులు రుణాలను రీ- షెడ్యూల్ చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మంజూరైన రుణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులకు, కొత్త రైతులను గుర్తించి బ్యాంకులు రుణాలు అందించడానికి ముందుకు రావాలని బ్యాంకర్లను కోరారు. విద్యా రుణాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి అవసరమైన వారికీ మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు రుణాలపై రైతులకు పూర్తీ స్థాయి అవగాహన కల్పించాలని, అంతర్ పంటలకు రెండు రుణాలు ఇచ్చే అవకాశాన్ని వారికి తెలియజేయాలన్నారు. పశుక్రాంతి పథకం కింద, పాలు ఇచ్చే పశువులు, పిగ్గరి, చేపల బోటులకు రుణాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ . ఎంజే అభిషేక్ గౌడ్, ఎల్డిఎం మాతునాయుడు, యూనియన్ బ్యాంక్ కన్వీనర్ జివిబిడి హరిప్రసాద్, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం జారీ చేసిన సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్

జిల్లాలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి

-నూతన తహశీల్దార్‌లను నియమించాలి

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసం నూతనంగా నిర్వహించే బదిలీలో బాగంగా తహశీల్దార్‌లను వెంటనే నియమించాలని ఆదివాసీ రాష్ట్రీయ అధికార మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం లో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, ఆదివాసీల పేరిట కొత్త జిల్లాల ఏర్పాటు చేసిన ప్రభుత్వం పరిపాలన మాత్రం గాలికి వదిలేసిందన్నారు. సాధారణ బదిలీలో బాగంగా ఏజెన్సీలో ఉన్న తహశీల్దార్‌లల్లో రెండు సంవత్సరం సర్వీస్ పూర్తి చేసిన వారికి మైదాన ప్రాంతంలో బదిలీ చేశారన్నారు. వారి స్థానంలో కొత్తగా తహశీల్దార్లు ను నియమించలేదని. ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేందుకు ఇష్టపలేదని ప్రభుత్వం నియామకం చేయలేదన్నారు. 50 సంవత్సరం వయోభారంతో ఉన్నవారిని ఏజెన్సీలో తహశీల్దార్ గా నియమించ రాదని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను దిక్కరించి విశాఖ జిల్లా కలెక్టర్ ముగ్గురు తహసీల్దార్లను అల్లూరి సీతారామరాజుకు బదిలీ చేశారన్నారు. బదిలీ పై వచ్చిన వారు వారి స్థానంలో జాయినింగ్ కాకుండా తమకు వయో భారం ఉందని హైకోర్టు ను ఆశ్రయించి విధుల్లో చేరలేదని చెప్పారు. దీని ఫలితంగా తహశీల్దార్ వ్యవస్థ బలహీనమై ఆదివాసీలకు రెవెన్యూ సేవలు అందడం లేదన్నారు. ముఖ్యంగా 1/70 చట్టాని దిక్కరించిన తహశీల్దార్లు ఏజెన్సీలో కొనసాగితే ఆదివాసీ హక్కులు, చట్టాలకు తీవ్రమైన ప్రమాదం ఉందన్నారు. ఇప్పుడు ఉన్న రెవెన్యూ వ్యవస్థతో విచ్చల విడిగా అక్రమ నిర్మాణం పెరిగిందని విమర్శించారు. కనీసం ఎల్.టి.అర్ కేసు నమోదు చేసే అధికార్లు కూడా లేకపోవడంతోనే ఆదివాసీ ప్రాంత పరిపాలన వ్యవస్థ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు నన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తక్షణమే నిబంధనల ప్రకారం కొత్త తహసీల్దార్ల నియమించాలని డిమాండ్ చేశాన్నారు.

దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు వారపు సంతలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై కేపీ నాయుడు చెప్పారు. వారపు సంతలో రోడ్డు కిరువైపులా సరుకు బస్తాలను ఫుట్ పాత్ లపై ఉంచాలని శుక్రవారం వ్యాపారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన కూరగాయలు, అల్లంతో పాటు ఇతర సరుకుల బస్తాలను రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపైనే ఉంచడంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఏర్పడుతుందని తెలిపారు.రోడ్డుపై ఉంచకుండా ఫుట్ పాత్‌పై ఉంచాలని వ్యాపారులను ఆదేశించారు. లగేజీ వాహనాలు రోడ్డుపై నిలుపుదల చేసి ఎక్కిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పునరావాస కాలనీ నిర్మాణంపై ఆరా తీస్తున్న అతుల్ జైన్

పునరావాస కాలనీల నిర్మాణం వేగవంతం

- పోలవరం ప్రాజెక్టు సిఇఒ అతుల్ జైన్ ఆదేశం

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ముంపునకు గురైన గిరిజనేతరులకు నిర్మిస్తున్న ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని పోలవరం ప్రాజెక్టు సీఈవో అతుల్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన గిరిజనేతరులకు గోకవరం మండలం, గోకవరం గ్రామంలో నిర్వహిస్తున్న పునరావాస కాలనీలో ఇళ్లను శుక్రవారం సిఇఒ అతుల్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన గిరిజనేతరులకు ఎటువంటి నష్టం లేకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ప్రస్తుతం 770 ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. సీఈఓ వెంట రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, సిఇ రాజేష్ కుమార్, మెంబర్ కార్యదర్శి యం.రఘురాం, డిడి యం.రవి, డిడి డియస్. ప్రసాద్, తహశీల్దారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖాధికారిగా ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి అటవీ శాఖ రేంజ్ అధికారిగా గుమ్మడి ఉషారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ రేంజ్ అధికారిగా పనిచేసిన మడకం అబ్బాయిదొర సాధారణ బదిలీపై చింతూరు వెళ్లారు. ఉషారాణి అడ్డతీగల రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఉషారాణి గతంలో చింతూరు డివిజన్, మైలవరం ప్రాంతాల్లో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కలప అక్రమ రవాణా, అడవి జంతువుల వేట, వాటి మాంసాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్ఎస్ఓ రాము, రైటర్ మధు, అటవీశాఖ సిబ్బంది రేంజర్ ఉషారాణిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఉషారాణి

బిటి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆదివాసీ గిరిజన సంఘం వినతి

వినతిపత్రాన్ని ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- అరకులోయ: కరకవలస రైల్వే రెండో లైన్ బ్రిడ్జి నిర్మాణంతో ధ్వంసమైన బీటి రోడ్డును ఆర్ ఎస్ఆర్ తుంబాత్ కంపెనీల గుత్తేదారులు తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు ఆధ్వర్యంలో అరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే రెండో లైన్ కన్స్ట్రక్షన్ ఏడి ఈఎన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు మాట్లాడుతూ, విశాఖపట్నం నుండి కిరండోల్ రైల్వే రెండో లైన్ నిర్మాణంలో భాగంగా బొండం, కరకవలస బ్రిడ్జి ఆర్ఎస్ఆర్ తుంబాత్ కన్స్ట్రక్చర్స్ కంపెనీ టెండర్ ద్వారా నిర్మాణం చేపడుతుందని, కరకవలస బ్రిడ్జి నిర్మాణం కోసం అతిభారీ వాహనాలు పరికరాలు, కంటైనర్లు రోడ్డు మార్గంలో తీసుకురావడంతో గన్నెల జంక్షన్ నుండి కరకవలస రైల్వే స్టేషన్ వరకు బిటి రోడ్డు ధ్వంసం అయ్యిందన్నారు. భారీ వర్షాలకు రోడ్డుపై మట్టి పేరుకుపోయిందన్నారు. బొండం పంచాయతీ రేగా, రంగినిగుడ, కరకవలస, జయంతివలస, కొలియగూడ, కొత్తవలస, అనంతగిరి మండలం కోనాపురం పంచాయతీ 10 గ్రామాల ఆదివాసీలు రవాణాకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు మార్గంలో ద్విచక్ర వాహనాలు, అంబులెన్సులు కూడా నడవ లేని విధంగా మరమ్మతుకు గురయ్యిందని, తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని ధ్వంసమైన రోడ్డును మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు టి.జోషి, టి. కృష్ణ, గ్రామస్తులు కె.కృష్ణ కె. జయరాం, దాసు, టి. దేవరాజు, రవీంద్రబాబు, గణేష్ పాల్గొన్నారు.

పల్లాకు వినతిపత్రం ఇస్తున్న స్వామి

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేయడం జరిగిందని అరకు పార్లమెంట్ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి తెలిపారు. విజయవాడలోని ఆత్మకూరులోని తెదేపా జాతీయ కార్యాలయంలో రాష్ట్ర టీఎన్టీయూసీ కమిటీ సమావేశం జరిగిందన్నారు. గిరిజన కార్మికుల సమస్యలతోపాటు ఉద్యోగుల సమస్యలను వివరించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో 15 ఏళ్లుదాటి అన్ని శాఖల్లో తాత్కాలిక ఉద్యోగులుగా గిరిజనులు పని చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో వీరికి క్రమబద్ధించకుండా కాలయాపన చేసి మోసం చేసిందన్నారు. వీరి ఆందోళనలో టీఎన్టీయూసీ అండగా ఉండి మద్దతు ప్రకటించిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందని ఆయన తెలిపారు.



రోడ్డు పనులు చేపడుతున్న గ్రామస్తులు

చందాలతో రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలం జర్రకొండ పంచాయతీ బురదగుమ్మ (పి వి టీ జి) గ్రామంలో ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు గ్రావిటి రోడ్డు, వంతెన పూర్తిగా కొట్టుకు పోయింది. దీంతో, సుమారు వారం రోజులుగా రవాణా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాలిబాటన కూడా నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. దీంతో, గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి సమస్య పరిష్కారానికి సిద్ధమయ్యారు. గ్రామస్థులు 50 కుటుంబాలు కలిసి ఇంటింటా చందాలు వేసుకొని సుమారుగా రూ.80వేలతో జెసిబితో గేదెలపాడు నుంచి బురద గుమ్మి వరకు కిలోమీటర్ న్నర వరకు రోడ్డు మరమ్మలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్రా చిట్టిబాబు, సిదారి లక్ష్మణరావు, సుక్రమం నాయుడు, మర్రి కేశ్వరరావు, పండు రాజు, తాగి మల్లేష్, కిలో కామరాజు, మర్రి అప్పలనాయుడు, సిదారి వెంకటరావు, సిదారి రాజేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెదబయలు: సీతగుంట పంచాయతీ సితగుంట పంటపొలాల సమీప మత్స్యగెడ్డలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం స్థానికులు మృతదేహాన్ని పరిశీలించి స్థానిక సర్పంచ్ పి.మాధవరావుకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పాడేరు మార్చురీకి తరలిస్తున్నట్లు ఎస్ఐ రమణ శుక్రవారం తెలిపారు.

ఎ.దారకొండకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

గాలికొండ ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండల ఎ.దారకొండ పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎంకి చెందిన గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గాలికొండ పంచాయితీ సప్పర్ల సచివాలయంలో సర్పంచి మురళి సత్యవతి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనా ఎ.దారకొండ పంచాయతీ నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా మంచినీరు, రోడ్లు, వంతెనలు సౌకర్యం లేక ప్రజల అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో ఉన్న గాలికొండ పంచాయతీకి ప్రభుత్వం నిధులు తక్కువగా మంజూరు చేయడంతో పంచాయతీ పరిధిలోని 13 గ్రామాలకు నేటికీ సిసి రోడ్లు వేయలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక దృష్టి సారించి గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఎ.దారకొండ పంచాయతీ పరిధి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధా, ఉప సర్పంచ్ చంటిబాబు, వార్డు మెంబర్లు ఆనంద్, చిట్టిబాబు, రామారావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సిపిఎం ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

జ్వరాల పట్ల ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాదికమల్లు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలు, ఇతర రోగాలతో బాధపడుతున్న 64 మందికి వైద్యాధికారి ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆదివాసులు జ్వరాలపై నిర్లక్ష్యం చేయరాదని హితవుపలికారు. జ్వర బాధితులు సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గ్రామాల్లో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ప్రధానంగా కాచి వడబోసిన నీళ్లను మాత్రమే తాగాలని, నిల్వ ఆహారం తీసుకోరాదని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి బావకుమారి, ఏఎన్ఎం మత్స్యకొండ సీత పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు

రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- దేవీపట్నం

మండలంలోని గోకవరం నుండి పోతవరం వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని "రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించరూ.." శీర్షికన సెప్టెంబర్ 29న ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. దీనిపై వాహనదారులు ధన్యవాదాలు తెలియజేశారు.

తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

అన్నవరంలో గ్రామసభ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి అన్నవరం, ఉమ్మడివరం గ్రామాలకు సంబంధించిన గ్రామసభ అన్నవరంలో సర్పంచ్ పూనం సరోజిని అధ్యక్షున శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, ముఖ్య అతిథులుగా పాల్గొని ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద చేపట్టవలసిన పనుల గుర్తింపుపై చర్చించారు. అనంతరం వారు గ్రామసభను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా విడుదలయ్యే నిధులను ఉపయోగించుకొని చెరువుల అభివృద్ధి, మొక్కలు పెంపకం, నర్సరీ పెంపకం, అంతర్గత రోడ్లు, ఇతర పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుర్కా కన్నారావు, వార్డు మెంబర్ కె.కమల, ఉపాధి హామీ ఎపిఓ, ఎస్సై, వెలుగు ఏపీఎం, గ్రామ సెక్రెటరీ శివప్రసాద్, సచివాలయం సిబ్బంది, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసపల్లి గ్రామానికి చెందిన 21 గిరిజన కుటుంబాలకు సీలేరు జూనియర్ కళాశాల అధ్యాపకులు, స్థానిక పోస్ట్ మాస్టర్ తమ సొంత డబ్బులతో నిత్యవసర సరుకులు కొనుగోలు చేసి శుక్రవారం పంపిణీ చేశారు. వలసపల్లి గ్రామానికి మంచినీరు, రహదారి సౌకర్యాలు పూర్తిగా లేవు. ప్రభుత్వం గ్రామంలో నేటికీ పాఠశాల నిర్మించలేదు. ఇటీవల స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆర్థిక సహాయంతో రేకులతో తాత్కాలికంగా పాఠశాల నిర్మించడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బోధన సాగిస్తున్నారు. ఎత్తైన కొండపై నివాసముంటున్న గిరిజనులకు ఏదో రకంగా ఆర్థిక సహాయం చేయాలన్న ఆలోచనతో జూనియర్ కళాశాల అధ్యాపకులు సాయిరాం, తలుపులయ్య, పోస్ట్ మాస్టర్ ప్రసాదరావు, శివ, మహేష్ తదితరులు వలసపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనాలపై నిత్యవసర సరుకులు తరలించారు. అనంతరం బియ్యం, బంగాళదుంపలు, పప్పు తదితర సరుకులు గిరిజనులకు అందించారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు, పోస్ట్ మాస్టర్

8న జాబ్ మేళా

ప్రజాశక్తి -పాడేరు : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ .ఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. జాబ్ మేళా గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ ఎం, జె.అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ లతో కలిసి శుక్రవారం ఐటిడిఏ సమావేశాలలో జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో చింతపల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఈనెల 8న (మంగళవారం) ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు మూడు కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాలో "అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, కేర్ ఫర్ యు తదితర కంపెనీలు పాల్గొన నున్నాయన్నారు. జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్ కార్డు ,ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10,000 నుండి 20,000 వరకు చెల్లిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. మరిన్ని వివరములకు 8985832827, 9398338105. సంప్రదిం చాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి పి.రోహిణీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు

మాట్లాడుతున్న మోస్య

ప్రజాశక్తి -అనంతగిరి:గ్రామ సభల ద్వారానే ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు చేయడం జరుగుతుందని ఉపాది హామీ అరకు ఇన్ చార్జీ ఏపిడి పవన్ అన్నారు. శుక్రవారం అనంతగిరి, టోకూరు, ఎగువశోభ పంచాయతీల గ్రామ సచివాలయంలో అనంతగిరి సర్పంచ్ సోమ్మెల రూతు, సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన గ్రామ సభ జరిగాయి. ఈ సందర్భంగా ఇన్ చార్జీ ఏపీడీ పవన్ మాట్లాడుతూ,లబ్ధిదారులు ముందుగా తీర్మానాలు అందజేయాలని సూచించారు. సర్పంచ్ కిల్లో మోస్య మాట్లాడుతూ, ఉపాధి హామీ ద్వారా సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, బాలకృష్ణ ఎంపిటిసి సభ్యులు సారా రత్నకుమారి, ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న, మాజీ సర్పంచ్ దొన్ను, వార్డు సభ్యులు లక్ష్మణరావు, ప్రసాద్ ,రామూర్తి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఘాట్ రోడ్డు మలుపులో లారీ, బైక్ ఢీ

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి ఘాట్ రోడ్డులో లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అరకు వారపుసంత నుండి ఆకుల లోడుతో విశాఖపట్నం వెలుతున్న లారీ, శ్రీకాకుళం నుండి అరకు వెళ్తున్న బైక్ను ఒటవ మలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో లారీ టైర్ కింద పడి బైక్ నుజ్జు నుజ్జు అయింది. బైక్ లో ఉన్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ప్రమాదంలో నుజ్జయిన బైక్

పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

223 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సీలేరు : రూ.11 లక్షలు విలువ చేసి 223 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితుల్ని అరెస్ట్ చేసి రిమైండ్ తరలించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు. స్థానిక విలేకరుల సమావేశంలో శుక్రవారం ఈ కేసు వివరాలు ఎస్ఐ వెల్లడించారు. ఎస్ఐ కథనం ప్రకారం... ఒరిస్సా నుంచి గంజాయి అక్రమంగా సీలేరు వైపు వస్తుందని విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు స్థానిక ఏపీ జెన్కో గుంటవాడ రిజర్వాయర్ చివర పోలీసులు శుక్రవారం కాపు కాశారు. ఈ క్రమంలోనే అటువైపు నుంచి రిజర్వాయర్ పైకి వస్తున్న ఆటోలో ఉన్న వారు పోలీసులు రాకను దూరంగా ఆటో నిలిపివేశారు. వెంటనే పోలీసులు స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురు తప్పించుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వారి నుండి 223 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. నిందితుల వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులును విచారించగా దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప గ్రామానికి చెందిన వారిగా ఒప్పుకున్నన్నారు. మల్కనగిరి జిల్లా పప్పులూరు పంచాయితీ కలిమెలా బ్లాక్ కప్పతోట్టి గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిపారు. తప్పించుకుని ముగ్గురితో పాటు మరొక ఇద్దరు సూత్రధారులు ఉన్నారని వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

గాలింపు కోసం వచ్చిన యువత

గల్లంతైన మెడికో విద్యార్థి కోసం యువత గాలింపు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం జిఎం.వలస పంచాయతీ పరిధిలోని జలతరంగిణి జలపాతం వద్ద సెప్టెంబర్ 22న నీటి ప్రవాహంలో గల్లంతైన ఏలూరు ఆశ్రమం మెడికల్ కాలేజీకి చెందిన విద్యార్థి హరదీప్ ఆచూకీ కోసం మారేడిమిల్లి బొలెరో వాహన యూనియన్ సభ్యులు, రిసార్ట్స్ యూనియన్, మారేడుమిల్లి యువత ఆధ్వర్యంలో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. హరదీప్ తల్లితండ్రుల కోరిక మేరకు జలతంగిణి నుండి పాములేరు వాగు వరకు కాలువను, కాలును ఆనుకుని ఉన్న చుట్టుపక్కల కొండలను అణువణువునా గాలించారు. అయినప్పటికీ హరదీప్ ఆచూకీ లభించకపోవడంతో నిరాశతో యువకులు వెనుదిరిగారు. యువత తిరుగు ప్రయాణంలో మారేడుమిల్లి నుండి చింతూరు మెయిన్ రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను శ్రమదానంతో పూడ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన మారేడుమిల్లి యువకులను స్థానికులు, పర్యాటకులు అభినందించారు.

సత్వరమే వినతులను పరిష్కరించాలి

పాటో: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్కుమార్, ఇతర అధికారులు

కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు : ప్రజల వినతులను త్వరితంగా పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పి.ఓ. వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. ఎం.పద్మావతితో కలసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 177 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ రోజు ఉదయం సాయంత్రం పి.జి.ఆర్.ఎస్ వెబ్ సైట్ను పరిశీలించి వివిధ శాఖలకు వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్రావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డి.వి.ఆర్.ఎం. రాజు, కె. వేణుగోపాల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ ఇ జవహార్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీవాణిధర్ రామన్, తహాశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు

తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణాలు, గృహాలు మంజూరు అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డుల మంజూరు, భూ సమస్యలు, ఆర్ . ఓ.ఎఫ్.ఆర్. పట్టాల మంజూరు కోసం అర్జీలు అందాయి.చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పోతురాజు గుమ్మలు గ్రామస్తులు జి. సత్తిబాబు, జి.మోహనరావు తదితరులు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ కొత్త సుజన కోట గ్రామస్తులు ఆర్.సుందరరావు, జి.గణపతి, ఆర్.రవీంద్ర తదితర 20 మంది ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తును అందజేసారు.డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ బుడ్డింగి గ్రామస్తులు కె.దాసుబాబు, పి. కామేశ్వరరావు తదితరులు జర్రాయి గ్రామం నుండి బుడ్డింగి గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరారు.అనంతగిరి మండలం పైనంపాడు పంచాయితీ కాకర పాడు గ్రామస్తులు కిల్లో గురు మూర్తి ఎగువ శోభ గ్రామం నుండి కాకారపాడు వరకు రోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందజేసారు.

పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు అప్పగించొద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు ఆసుపత్రి నిర్మాణం, నిర్వహణను పిపిపి పద్ధతిలో చేపట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పోర్ట్ ఆసుపత్రి వద్ద దీక్ష శిబిరంలో మాట్లాడుతూ కైలాసపురంలో 80 పడకలతో నడుస్తున్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పిపిపి భాగస్వామ్యంతో 300 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చనున్నట్లు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ లోక్సభలో ప్రకటించారన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పద్మనాభరాజు

పోర్టు ఉద్యోగుల వైద్యం ఖర్చును తగ్గించడానికి ఈ ప్రతిపాదన చేశామన్న మంత్రి ప్రకటన బూటకమన్నారు. కేంద్రం నిర్ణయం 4000 మంది పోర్టు ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, వారి కుటుంబాలతోపాటు 13వేల మంది పెన్షనర్లకు ప్రభుత్వ వైద్యాన్ని పూర్తిగా దూరం చేయడమేనని మండిపడ్డారు. పిపిపి విధానంలో గంగవరం పోర్టు, వైజాగ్ పోర్టుల్లో బెర్త్లను వేదాంత, అదాని, ఎస్సార్ వంటి ప్రైవేటు సంస్థలకు కేటాయించగా, పోర్టుల్లో పిపిపి, బిఒటి విఫలమైందన్నారు. గతంలో కాగ్ నివేదిక ఇచ్చిందని, అంతేకాక దీని వల్లపోర్టులకు నష్టం వాటిల్లినట్లు పేర్కొందని గుర్తు చేశారు. పబ్లిక్ ఆస్తులను ప్రైవేటుకు గంపగుత్తగా ధారదత్తం చేయడమే కేంద్ర ప్రభుత్వం పిపిపి విధాన లక్ష్యమని మండిపడ్డారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రైవేటుపరం చేస్తే వైద్యసేవల్లో జవాబుదారీతనంఉండదన్నారు. ఈ నేపథ్యంలో పోర్టు ఆసుపత్రినిపోర్ట్ యాజమాన్యమే పోర్టు సొంత నిధులతో నిర్వహించా లన్నారు. అవసరమైన వైద్యనిపుణులను నియమించి, మందులను అందుబాటులో ఉంచి వైద్యసేవలను మెరుగురచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన నిర్ణయంపై వెనక్కు తగ్గకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, రాఘవులు. యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, విడిఎల్బి డాక్ వర్కర్స్ యూనియన్, సిఐటియు అధ్యక్షుడు జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోలాటం పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : దసరా సందర్భంగా గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కోలాటం కళాకారులతో సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజేతలకు మొదటి బహుమతిగా రూ 50,116, రెండో బహుమతిగా రూ 25,116లు, మూడో బహుమతిగా రూ15,116లు ఈనెల 12న విజయదశమి రోజున ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావు అందజేస్తారన్నారు. ఆసక్తి గల వారు తహాశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు

సమస్యలు పరిష్కరించాలని విఒఎల ధర్నా

ధర్నా చేపడుతున్న విఒఎలు

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగు వివోఏలు శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరు ఐటీడీఏ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్బి పోతురాజు మాట్లాడుతూ, వెలుగు వివోఎల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వివోఎల మూడు సంవత్సరముల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, యూనిఫామ్తో గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ యాప్లపై శిక్షణ కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. అనంతరం తమ సమస్యలపై వివోఎల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు వివోఏ ల సంఘం జిల్లా అధ్యక్షురాలు భాను, కార్యదర్శి ఎల్ బి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనంతగిరిలో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో టోకురు పంచాయతీ జాకరవలస గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసి రోడ్డు పనులకు శుక్రవారం స్దానిక సర్పంచ్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కిల్లో మోస్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ 2 రెండు లక్షలు సీసీ రోడ్డు పనులకు కేటాయించామన్నారు. ఈ మధ్యకాలంలో టోకురు, బగ్మరవలస తదితర గ్రామలకు జిల్లా పరిషత్ నిదులు సుమారు రూ.20లక్షలతో డ్రైనేజీల పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, వార్డు సభ్యులు సమర్ధి,రామ్మూర్తి గ్రామ పెద్దలు దొన్ను, చంద్రరావు, అప్పలస్వామి నరాజి, సురేష్ ,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని తాడిపుట్టు గ్రామపంచాయతీ గడుగుపల్లిలో గ్రామంలో జడ్పి నిధులతో శుక్రవారం మురుగు నీటి కాలువ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గతంలో గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సాగర సుబ్బారావు, టీడిపి నాయకులు సోమేలి లక్ష్మయ్య, వార్డు మెంబర్లు కిరసాని సుబ్బారావు, కిలగడ సావిత్రి పాల్గొన్నారు

జిమాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ గనలబ గ్రామంలో 15వ ఆర్థిక నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ మాణిక్యం, కార్యదర్శి రవి శాస్త్రి, వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు

మెగా డిఎస్సిపైనే నిరుద్యోగుల ఆశలు

విశాఖ జిల్లాలో భారీ స్థాయిలో 60574 దరఖాస్తులు
21 వరకూ టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మెగా డిఎస్సిపైనే నిరుద్యోగుల ఆశలన్నీ ఉన్నాయి. టీచర్ పోస్టు కొట్టాలన్న కసి అందరిలో కనిపిస్తోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేకపోవడంతో నిరుద్యోగ సైన్యం భారీగా పెరిగిపోయిందని విశాఖ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఏటా 4 వేల మంది వివిధ విద్యా సంస్థల నుంచి అన్ని అర్హతలు కలిగిన వాళ్లు బయటకొస్తున్నారని వెల్లడిస్తున్నారు. గడిచిన పదేళ్లలో 16,300 పోస్టులతో ప్రకటించిన మెగా డిఎస్సినే పెద్ద నోటిఫికేషన్ అని చెప్పొచ్చు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోచుకోని వారు వేల సంఖ్యలో జిల్లాలో ఉండడంతో వారంతా ఇప్పుడు పకడ్బందీ ప్రణాళికలతో సిద్ధమవుతున్నారు.

తీవ్ర పోటీ

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకుగానూ కూటమి ప్రభుత్వం జారీచేసిన డిఎస్సికి అర్హత సాధించే టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు నిరుద్యోగుల నుంచి ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు వచ్చాయి. విశాఖ జిల్లాలో 60,574 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు కేటగిరీలకు పోటీ పడేందుకు సిద్ధమయ్యారు. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా పోస్టులే 16,300 ఉండగా విశాఖ జిల్లాలోనే ఈ స్థాయిలో పోటీ ఉండటాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకూ వీరికి టెట్ నిర్వహణ ప్రక్రియ కొనసాగనుంది. విశాఖ జిల్లాకు పైన తెలిపిన 16,300 పోస్టుల్లో 1500 పోస్టుల మేరకు ఉండొచ్చని విద్యావేత్తలు అంచనా వేస్తున్నారు. గత జగన్ హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకూ టెట్ నిర్వహించారు. మార్చి 30న డిఎస్సి ప్రారంభం కావాల్సి ఉన్నా జరగలేదు. 6100 పోస్టులకే డిఎస్సి అని ప్రకటన చేసినా ఎన్నికల కోడ్తో పక్కదారిపట్టింది. కోడ్ ముగిసే వరకూ డిఎస్సి నిర్వహణ, టెట్ ఫలితాల విడుదల వాయిదా వేయాలని కోర్టు ఆదేశించడంతో ఆగిపోయింది.

తాజాగా కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సి ప్రణాళికతో వేల పోస్టులకు తెర తీసింది. గత ప్రభుత్వం నిర్వహించిన టెట్ ఫలితాలు జూన్లో కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అప్పటికే టెట్కు దరఖాస్తు చేసుకోని వారు లేదా ఆ ఫిబ్రవరి పరీక్షలో అర్హత సాధించలేని వారు కూడా అధికంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం మరలా టెట్ నిర్వహణకు సిద్ధమై నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో తాజాగా వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడంతో 60 వేలకు పైగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగానే 2024 ఫిబ్రవరిలో 2.60 లక్షలు దరఖాస్తులు రాగా ఈ కొద్దినెలల్లో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన నోటిఫికేషన్తో 4.30 లక్షల మంది పెరిగిపోయారు. అంటే 60 శాతం దరఖాస్తులు పెరిగాయి. ఈ ప్రభుత్వమైనా మెగా డిఎస్సిని సక్రమంగా నిర్వహించాలన్న డిమాండ్ ఉద్యోగార్థుల నుంచి వినిపిస్తోంది.

చెత్త పన్ను రద్దు ప్రజా పోరాట విజయం : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో చెత్త పన్ను వసూళ్ల రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల సిపిఎం విశాఖ జిల్లా కమిటీ హర్షం వ్యక్తపరిచింది. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. చెత్త పన్ను రద్దు ప్రజల పోరాటానికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వ పట్టణ సంస్కరణలలో భాగంగా గత వైసిపి ప్రభుత్వం ప్రజల మీద చెత్త పన్ను, విలువ ఆధారిత ఆస్తి పన్ను భారాలు వేసిందన్నారు. చెత్త పన్ను చట్ట విరుద్ధమని, దీనిని రద్దు చేయాలని సిపిఎం ప్రజలను సమీకరించి అనేక రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. చెత్త పన్ను చెల్లించవద్దని ప్రజలకు పిలుపునిచ్చిందని, ఆందోళనలకు, చెత్త పన్ను చెల్లింపు నిరాకరణకు ప్రజలు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి ?

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలను ఎందుకు అమలు చేయలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ ప్రశ్నించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీని అమలు చేస్తామని ప్రకటన చేశారని, ఆ గడువు దాటి రెండు నెలలు సమీపిస్తున్నా ఉచిత బస్సు అమలు కాలేదని మండిపడ్డారు. ఇప్పటివరకు చంద్రబాబు నాయుడు ఒక్క సిక్స్ కూడా కొట్టలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ, కర్ణాటక మాదిరిగా పథకాలు అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చాక కూడా అమరావతి, పోలవరం జపం చేస్తున్నారని, రాజధాని త్వరగా నిర్మించాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంతవరకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు అధికార పార్టీలోని నాయకులకు, కాంట్రాక్టర్లకు వరంగా మారిందని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగా పోలవరం ప్రాజెక్టుపై కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. దాన్ని సిఎం చంద్రబాబు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. హర్యానా, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర ఎన్నికలలో బిజెపి చిత్తుగా ఓటమి చెందుతుందని జోస్యం చెప్పారు. ఆ తరువాత కూలిపోతుందన్నారు.

దేశంలో నిరుద్యోగం, ఆకలి, పన్నులు బాగా పెరుగుతున్నాయని, ఆ సమస్యలను పట్టించుకోకుండా తిరుపతి లడ్డులో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. తాను అక్కడ పరిశీలించిన నెయ్యి నూనె మాదిరిగా ఉందని, అంతమాత్రాన జంతువుల కొవ్వు కలిసినట్టు కాదని తెలిపారు. అక్కడి సిబ్బంది అంతా బ్రాహ్మణులేనని, జంతువుల కొవ్వు కలిస్తే వారు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. స్వచ్ఛమైన నెయ్యి ధర కిలో రూ.700కు పైగా ఉంటే రూ.320కే ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ తిరుపతిలో చేసిన ప్రకటన తనను బాధించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ ఎంతగానో పెరుగుతోందని, సరైన నాయకత్వమే కరువైందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గార సూర్యారావు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ వరలక్ష్మిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

శానిటేషన్ వర్కర్కు సిఐటియు నేతల పరామర్శ

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రమాదంలో గాయపడిన స్కూల్ శానిటేషన్ వర్కర్ వరలక్ష్మిని సిఐటియు నాయకులు శుక్రవారం పరామర్శించారు. మండలంలోని విఆర్.పురం బీసీ కాలనీ చెందిన వరలక్ష్మి విజయవాడలో జరిగిన స్కూల్ శాడిటేషన్ వర్కర్ల సమవేశానికి వేళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి గాయపడ్డారు. వైద్యం అనంతరం శుక్రవారం తమ గృహానికి చేరుకోవటంతో స్కూల్ శాడిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కార్యదర్శి ఎస్.వరలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, ఎన్.ప్రకాశరావు, సిహెచ్.పద్మ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

కెజిహెచ్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్లో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా వన్ స్టాప్ సెంటర్ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉద్యోగుల విధి నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఆధునికీకరణ, ఇతర పనుల గురించి కెజిహెచ్ సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర కారాగారం సందర్శనలో ఖైదీలకు కేటాయించిన బెడ్లు సరిపోవడం లేదని అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఆ విషయమై కెజిహెచ్ అధికారులను ఆరా తీశారు. రాజేంద్రప్రసాద్ వార్డులో ఇప్పుడున్న బెడ్ల సంఖ్యను పెంచాలని, ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వార్డుల్లో తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. వైద్య సేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కెజిహెచ్ వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యటనలో ఆయన వెంట కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఐసిడిఎస్ పీడీ జయదేవి, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ నాయుడు, ఇతర అధికారులు, కెజిహెచ్ వైద్యాధికారులు ఉన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడించారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 124 అంశాలతో పాటు 19 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 143 అంశాలను పొందుపరిచారని, వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 12 అంశాలను వాయిదా వేయగా, 93వ అంశమైన అనకాపల్లి మార్కెట్కు సంబంధించిన ఒక అంశాన్ని తిరస్కరించారని తెలిపారు. 118వ అంశమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తనిఖీల బృందం సభ్యుల జీతాలను ఆమోదిస్తూ, ఇకపై తనిఖీ బృందాల సర్వీసులను నిలుపుదల చేస్తున్నట్లు సభ్యులు తీర్మానించారని ఆమె తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.31.56 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.55.22 లక్షల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. సమావేశంలో జివిఎంసి కార్యదర్శి ఎంవిడి.ఫణి రామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్య నాయుడు పాల్గొన్నారు.